సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 18 : ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొమటిబండలోని శ్రీపంచ పాండవ పిరమిడ్ క్షేత్ర ఆరో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేస్తే ఒత్తిడి దరిచేరదన్నారు. ధ్యానంతో విద్యార్థులకు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ట్రస్టు నిర్వాహకులు నర్సింహులు, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, వెంకట్ రెడ్డి, వేణు, ప్రశాంత్, నర్సింగరావు, బాలు, బ్రహ్మచారి పాల్గొన్నారు.

21 నుంచి లక్ష్మాపూర్‌లో జాతర

వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మాజీ సర్పంచ్ స్వామి, పూజారులు

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 18 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ లక్ష్మాపూర్‌లో ఈనెల 21వ తేదీ నుంచి మూడురోజులపాటు సమ్మక్క, సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి తెలిపారు. ఆదివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితోపాటు పలువురిని కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు



గజ్వేల్ : జడ్జి ప్రియాంకను సన్మానిస్తున్న గౌడ సంఘం నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 18: గజ్వేల్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ పంచమవార్షికోత్సవాన్ని ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలతో నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గజ్వేల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ప్రియాంక పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు అమ్మవారిని పలువురు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దమ్మ దేవాలయం ముస్తాబు

నేటి నుంచి ఐదు రోజులపాటు ఉత్సవాలు

నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయం

రాయపోల్, ఫిబ్రవరి 18 : మండలంలోని అనాజీపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠఉత్సవాలకు ముస్తాబైంది. పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠతో పాటు పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవాలు నిర్వహించేందుకు ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు. సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు వివిధ పూజా కార్యక్రమాలు ఉంటాయని, 23న పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రార్థన మందిరాల్లో సదుపాయాలు కల్పించాలి

సిద్దిపేట టౌన్,ఫిబ్రవరి 18 : పవిత్ర రంజాన్ మాసం మరో 20 రోజుల్లో ప్రారంభం కానున్నదని, మసీదులు, ప్రార్థన మందిరాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని సిద్దిపేట తంజీమ్ గౌరవ అధ్యక్షుడు గౌస్ మొయినొద్దీన్, అధ్యక్షుడు ఆసిఫ్ కోరారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సిద్దిపేట తంజీమ్ కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రంజాన్ మాసం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రార్థన మందిరాల్లో సకల సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈద్గా మైదానం, మసీదులో లైటింగ్, పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో తంజీమ్ సభ్యులు, మత పెద్దలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

సిద్దిపేట పట్టణంలో పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటలో పలు వివాహాలకు హాజరైన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి18: సిద్దిపేట పట్టణంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పలు వివాహాలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో జరిగిన సీనియర్ జర్నలిస్ట్ రాజిరెడ్డి కూతురు, వీఎస్ఎస్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన మున్సిపల్ కౌన్సిలర్ పాతూరి శ్రీనివాస్‌రెడ్డి కుమారుడి పెండ్లికి, బైరి అంజయ్య గార్డెన్‌లో జరిగిన నంగునూర్ మండలం రాంపూర్ ఎంపీటీసీ నితిన్, దేవీగార్డెన్‌లో జరిగిన పార్టీ సీనియర్ నాయకులు బీడ రాయుడు కూతురు, మొకిడి నర్సింహ గార్డెన్, పటేల్ గార్డెన్, లింగారెడ్డిపల్లి ముదిరాజ్ ఫంక్షన్‌హాల్ , సీసీగార్డెన్, పద్మనాయక ఫంక్షన్‌హాల్, పద్మశాలీభవన్‌లో జరిగిన వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్

ఒకటో తారీఖు జీతాలు వేయాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 18 : గతంలో మాదిరిగానే ఒకటో తారీఖు ఉపాధ్యాయులకు జీతాలు వేయాలని ఎన్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ఎన్జీవోస్ భవన్‌లో ఆదివారం ఎన్టీయూ జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలన్నారు. సరైన సమయంలో జీతాలు జమకాకపోవడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. సమావేశంలో ఎన్టీయూ సంఘం నాయకులు రంగారావు, శ్రీధర్, యాదగిరి, లింగారెడ్డి,భూపాల్, శ్రీనాథ్, చంద్రశేఖర్, వేణుకుమార్, రాములు, బాలనర్సయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

మండల కమిటీకి ఎన్నిక పత్రాలు అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 18 : ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైసరాములు అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్ హరిత హోటల్‌లో నిర్వహించిన మండల కమిటీ సమావేశం సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిస్తే ఆ రిజర్వేషన్లు భారతదేశంలో అన్ని కులాలకు అందలేదన్నారు. అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ పోరాటం చేస్తున్నాయన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉబ్బని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల రవీందర్, ఉపాధ్యక్షుడిగా బొదిస్వామి, కోశాధికారిగా బుర్కి ప్రశాంత్, సభ్యులుగా నవీన్, కరుణాకర్, చెప్యాల శ్రీకాంత్, రాజు, కరుణాకర్ ఎన్నికయ్యారు.

చలో సెక్రటేరియట్‌ను విజయవంతం చేయాలి

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 18: ధూపదీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారం కోసం నెల 20వ తేదీన చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధూపదీప నైవేద్య సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు శేషం శ్రీనివాసాచార్యులు, రాష్ట్ర సభ్యుడు దేశపతి రాజశేఖర్‌శర్మ వేర్వేరుగా పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ధూపదీప నైవేద్య అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా నియామకమైన అర్చకులకు, గతంలో నియామకమైన అర్చకులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అక్కన్నపేట, ఫిబ్రవరి 18: హుస్నాబాద్ సబ్‌స్టేషన్‌లో పనులు జరుగుతున్నందున సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని హుస్నాబాద్ విద్యుత్ శాఖ ఏడీ దుర్గా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లోని పందిల్ల, రామవరం, గండిపల్లి, అక్కన్నపేట, గౌరవెల్లి, ధర్మారం, తోటపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్యాగు అప్పగింత

కొమురవెల్లి, ఫిబ్రవరి 18 : కొమురవెల్లి మల్లన్న జాతరకు వచ్చిన భక్తురాలు ఇప్ప అనూష తన బ్యాగును పోగొట్టుకుంది. ఆ బ్యాగు వెంకటేశ్ అనే భక్తుడికి దొరకడంతో పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద అప్పగించాడు. ఎస్సై నాగరాజు అతడిని అభినందించి బ్యాగు పోగొట్టుకున్న భక్తురాలిని పిలిపించి అందజేశారు. బ్యాగులో మూడు మొబైల్స్‌తోపాటు విలువైన వస్తువులు ఉన్నాయి.

'గౌరవెల్లి' పనులు కనిపించడం లేదా?

మున్సిపల్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుద్దాల చంద్రయ్య

మాట్లాడుతున్న సుద్దాల చంద్రయ్య

హుస్నాబాద్, ఫిబ్రవరి 18: గౌరవెల్లి రిజర్వాయర్ పనులు వందశాతం పూర్తయి ట్రయల్‌రన్ సైతం నిర్వహించి అందులో నీళ్లు నింపిన విషయం హుస్నాబాద్ ప్రాంత కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని మున్సిపల్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుద్దాల చంద్రయ్య ప్రశ్నించారు. హుస్నాబాద్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేవలం 1.24టీఎంసీల సామర్థ్యంతో ఉన్న రిజర్వాయర్‌ను 8.23టీఎంసీలకు పెంచి పనులు పూర్తి చేయించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ నాయకులు నిర్వాసితులతో కలిసి ఎన్‌జీటీలో కేసులు వేయించి పూర్తి స్థాయిలో నీళ్లు నింపకుండా అడ్డుకున్నారని విమర్శించారు. కాల్వల నిర్మాణం కోసం రూ.200కోట్లను సైతం అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవి అనుభవించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన రిటైర్డు ఉద్యోగి కవ్వ లక్ష్మారెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించే అర్హత లేదన్నారు. గౌరవెల్లి గురించి ఏమాత్రం అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు, జేఏసీ అని చెప్పుకునే నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు పర్యావరణ పరీక్ష

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 18 : ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరీక్ష నిర్వహిస్తున్నట్లు దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఉదయం తొమ్మిది గంటల వరకు తమ పిల్లలను కళాశాలకు పంపించాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు.

కవులకు ఘన సన్మానం

చేర్యాల, ఫిబ్రవరి 18 : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆదివారం శ్రీవాణీ సాహితీ పరిషత్, సిద్దిపేట రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో చేర్యాల కవులకు సన్మానం లభించింది. చేర్యాల పట్టణానికి చెందిన కవులు ఎం.రామచంద్రమూర్తి, ఐలయ్య, ప్రభాకర్, జనార్దన్ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. చేర్యాల ప్రాంత ఉనికి, ఇక్కడ సాహితీ సౌరభాలను వ్యాపింపజేస్తున్న కవులను నిర్వాహకులు సన్మానించారు. సన్మానం పొందిన కవులను చేరసం నాయకులు, టీచర్లు అభినందించారు.

సమాజాన్ని మార్చేదే కవిత్వం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 18 : సమాజాన్ని మార్చేదే కవిత్వం అని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రచయితల సంఘం, శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 30 మంది కవులు మాతృ భాషపై తమ కవితలు వినిపించి ఆద్యంతం అలరించారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సత్కరించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

అక్కన్నపేట, ఫిబ్రవరి 18 : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని అంతకపేటకు చెందిన రామంచ మహేందర్‌రెడ్డి ఆదివారం నియమితులయ్యారు. గతంలో మహేందర్‌రెడ్డి ఉమ్మడి హుస్నాబాద్ బీజేపీ మండలాధ్యక్షుడిగా పని చేశారు. మహేందర్‌రెడ్డి అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా నియామకం కావడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

రాయపోల్, ఫిబ్రవరి18 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. శనివారం రాత్రి మండలంలోని సయ్యద్‌నగర్‌లో మూఢనమ్మకాలు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేట, ఫిబ్రవరి 18 : కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేస్తే తమను ప్రభుత్వం అన్యాయంగా విధుల నుంచి తొలిగించిందని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్నారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు దవాఖాన ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే సూపరింటెండెంట్ కిశోర్ గత రాత్రి మెసేజ్ పంపించి విధుల నుంచి తొలిగించడం తగదన్నారు. సీఐటీయూ నాయకుడు రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 18: నూతన ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలలో ఆదివారం జరిగిన తపస్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా 317 జీవో సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి.. ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. బదిలీలు, ప్రమోషన్లు లేక ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారని, వెంటనే బదిలీలు, ప్రమోషన్లు కల్పనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

బాల్యమిత్రులకు ఆర్థిక సాయం అందజేత

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 18 : అనారోగ్యంతో బాధపడుతున్న బాల్యమిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన యాదగిరి నెలరోజులుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రజ్ఞాపూర్ ప్రభుత్వ పాఠశాల (1998-99)లో టెన్త్ చదివిన యాదగిరి బాల్యమిత్రులు వెంటనే స్పందించారు. ఆదివారం మిత్రులంతా కలిసి యాదగిరి ఇంటికి వెళ్లి రూ.35వేల సహాయం అందించగా, చదువు చెప్పిన రిటైర్డు ఉపాధ్యాయుడు యూసూఫ్‌ఖాన్, హన్మంతరెడ్డి, సంగీతరెడ్డి, కుర్రెమహిపాల్‌రెడ్డి తదితరులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

లచ్చపేటలో...

దుబ్బాక టౌన్, ఫిబ్రవరి 18: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన కొండ బాలకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాల్యమిత్రులు అండగా నిలిచారు. లచ్చపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో (1997-98) టెన్త్ పూర్వ విద్యార్థులు కలిసి బాలకృష్ణ కుటుంబానికి రూ. 40 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. బాలకృష్ణ కూతురు పేరు మీద సుకన్య సమృద్ధి యోజన పథకంలో డిపాజిట్ చేసిన రూ.40 వేల బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, ఎల్లం, నిమ్మ ఎల్లం, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకల మృత్యువాత

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి18: వీధికుక్కల దాడిలో మేకలు మృత్యువాత పడిన సంఘటన మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తుప్పతి ఎల్లయ్య గొర్రెలు, మేకలను పోషించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిమాదిరిగానే మేకలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం దొడ్డిలో ఉంచాడు. రాత్రి వీధికుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి మేకలపై దాడి చేశాయి. ఈ దాడిలో ఏడు మేకలు మృతి చెందగా పలు మేకలు గాయపడ్డాయి. ఈ ఘటనలో రైతుకు సుమారు రూ. లక్ష నష్టం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

సమ్మక్క - సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న సమ్మక్క-సారలమ్మ గద్దెలు

గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న చలువ పందిర్లు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి18: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్‌లో రెండేండ్లకు ఒకసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర కొనసాగనుంది మూడు దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూటిగల్ సమ్మక్క-సారలమ్మ జాతర మినీమేడారంగా విరాజిల్లింది. సమ్మక్క-సారలమ్మ గద్దెలకు రంగులు వేసి గద్దెల ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీ పలు ఏర్పాట్లు చేస్తున్నది. తాగునీటి సౌకర్యం కోసం ప్రత్యేకంగా వాటర్ ట్యాంకులు , రోడ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జాతర పరిసరాల్లో చలువ పందిర్లు వేస్తున్నారు. ఇప్పటికే చిరవ్యాపారులు జాతర ప్రాంగణంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. కూటిగల్ సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు.

కూటిగల్‌లో షూటింగ్స్ జోరు

- సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వరుసగా పాటల చిత్రీకరణ
- షూటింగ్‌లకు అనువైన ప్రదేశాలుగా కూటిగల్, బెక్కల్ పరిసరాలు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 18 : ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామంలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల పరిసరాల్లో కొన్ని రోజులుగా షూటింగ్‌ల జోరు కొనసాగుతున్నది. మినీ మేడారంగా ప్రసిద్ధి చెందిన కూటిగల్ సమ్మక-సారలమ్మ గద్దెల వద్ద పలువురు ఔత్సాహిక దర్శకులు సమ్మక-సారక్కల పండుగ నేపథ్యంలో పాటలు చిత్రీకరిస్తున్నారు. ఇటీవల దర్గుపల్లి ప్రభాకర్ నిర్మాణంలో 'మేడారం తల్లి మేడారం' సమ్మక్క-సారక్క-2024 అనే పాటను నటీనటులపై చిత్రీకరించారు. ప్రముఖ జానపద గాయకురాలు కనకవ్వ పాట పాడడమే కాకుండా ప్రత్యేక పాత్రలో నటించారు. జానపద గాయకురాలిగా పేరుగాంచిన కనకవ్వది కూటిగల్ స్వగ్రామం కావడం విశేషం. దీనికి తోడు ఇటీవల కేకే మ్యూజిక్ ఆధ్వర్యంలో కేమిడి కనకరాజ్ దర్శకత్వంలో 'సిలకలాది గట్టు అబ్బీయా' అనే పాటను చిత్రీకరించారు. గతంలో బెక్కల్ రామచల గుట్టపై శివరాత్రి నేపథ్యంలో కేకే మ్యూజిక్ ఆధ్వర్యంలో ఓ పాటను చిత్రీకరించారు. సమ్మక్క-సారక్కల నేపథ్యంలో పాటలు చిత్రీకరించేందుకు కూటిగల్ ఎంతో అనువైన ప్రాంతమని, గద్దెల పక్కనే చెరువు, సమీపంలో గిరిజన తండాలు, బెక్కల్ రామాచలగుట్ట ఉండడంతో పాటల చిత్రీకరణ అత్యంత సుందరంగా జరుగుతుందని పలువురు యువ దర్శకులు అభిప్రాయపడుతున్నారు.

కూటిగల్ సమ్మక్క-సారక్క గద్దెల వద్ద నటీనటులపై పాట చిత్రీకరణ

సహచర కళాకారులతో ప్రముఖ జానపద గాయకురాలు కనకవ్వ